# తగిన శిక్ష

*

రచన : శ్రీ తాళ్ళ గోవింద రావు.

'ఛీ! ఇంత జరిగాక బ్రతుకటం కన్నా యింత విషం తినుకొని గుట్టుగా 'హరీ' అనడం మంచిది. ఫలానా వాడి భార్య లేచిపోయింది అని పలువు రూములుకల్లాంటి మాటలతో పువ్వులాంటి నా హృదయాన్ని వెకిలి నవ్వులతో పలుకుతుంటే అప్పుడు నేనేం కావాలి? నా హోదా, నా ధర్మం, నా గౌరవాలకు వాళ్ల నోటి పోటి మాటలవాళ్ళతో పునాది కట్టవల్సిందేనా?

'ఒరేయ్ గిరీ! చుక్కలాంటి భార్యతో చక్కగా చక్కగా సంసారాన్ని గడుపుతున్నావ్! నువ్వదృష్టవంతుడివిరా.'

'నీకేంరా! హోదాగల వుద్యోగం, గుణ, రూప సంపదలున్న భార్య, చల్లని పిల్లగాలులికి, తెల్లని వెన్నెలతోడైనట్లు మీరిద్దరూ హాయిగా కాలాన్ని గడుపుతున్నారు. నీ బ్రతుకు బంగారు బాటరా!

ఆనాటి తన స్నేహితులమాటలకు తన హృదయం గేస్ బెలూన్‌లా ఆకాశాని కెగిరిపోయినంత సంబరపడ్డాడు! కాని ఈనాడు రమణి చేసిన నీచపు పనికి తన హృదయం పాతాళానికి దిగజారిపోయింది! ఇటువంటి ఆలోచనలతో గిరి మనస్సు కాగే నూనెలో కాగిపోతోంది రోడ్డువైపు చూశాడు...!

ఏ అపరాధం చెయ్యకుండా పోలీసులవెంట నడుస్తున్న నిరపరాధి హృదయంలా గిరిహృదయం నలిగిపోతోంది! కుగిలిపోతోంది!

వీధిలోనికి వెళ్ళడానికి మనస్కరించలేదు. అతడి అనుమానం అవమానం వికృత రూపాలు దాల్చి అతడిముందు అపహాస్యాలు చేస్తున్నట్లు అనిపించింది!

'ఏం ముఖం పెట్టుకొని వీధిలోనికి వెళతావ్? నీ భార్య ఏమైందని నలుగురూ అడిగితే వాళ్ళకేం సమాధానం చెబుతావ్?' అంతరాత్మ గిరికి అనుమానాల పరదాను అడ్డంగా వేసింది.

రమణికి నేనేం తక్కువ చేశాను? నాకేం తక్కువ? అందం లేదా?

ఐశ్వర్యం లేదా? ఆమె సరదాలకు తనేనాడూ అడ్డు చెప్పలేదే!



ఆమె ఏది కోరితే అది ఏ బాధ పడైనా సరే తీర్చేవాడ్నే!

ఆమె ఎందుకిటువంటి పని చేసింది? అవమానాలవంటి ఈటెల పోటులతో అనుక్షణం నరక యాతన అనుభవిస్తూ తన్ని కృశించి పొమ్మనా? లేక ఆడదాన్ని నమ్ముకుంటే అధఃపాతాళానికి దిగజారిపోతావని గుణపాఠం చెప్పిందా? ఛీ! ఛీ! దానికంత దూరాలోచనవుంటే యిటువంటి పాడుపని ఎందుకు చేస్తుంది? ఎవరి ఖర్మ వారిది? కాని ఒకరి కర్మను అనుభవించటానికి యింకొకరిని కర్తగా చెయ్యడం అంత మంచివి కాదు. ఒక వేళ యిందులో తన దోష మేమైనా వుందా? గిరి నొసటిని వేళ్ళతో రాసుకుంటూ అనేకవిధంగా చాలా ఆలోచించ సాగాడు. ఎదురుగా టేబుల్ ఫేన్ తనకేమీ సంబంధం లేనట్లుగా తిరుగుతోంది. ఫేనులాగే గిరి ఆలోచనలు, మూడు సంవత్సరాల క్రిందటి జరిగినవి కళ్ళముందు తిరగసాగాయి...

◆ ◆ ◆ ◆

దిక్కూ మొక్కూ లేని గిరని ఆ వూళ్లోనే వున్న శ్రీధరంగారనే శ్రీమంతుడు చేరదీసి కాలేజీ చదువు చదివించారు. గిరికూడా అతిశ్రద్ధగా చదువుకుంటూ శ్రీధరంగారికి పేరు ప్రతిష్టలు సమకూర్చారు.

శ్రీధరంగారికి 'సీత' అనే కూతురూ 'మురళి' అనే కొడుకూ తప్ప వేరెవ్వరూ లేరు. గిరి వినయ విధేయతలు, శ్రీధరంగారి యింటి అల్లుడిగా చేసుకోలనేంత నీతి వరకూ తెచ్చాయి. గిరి, సీత గూడా కలసి, మెలసి తిరుగుతూ ఎప్పుడూ చలాకీగా వుండేవారు. తండ్రీ కొడుకు లిద్దరికీ, సీతను గిరికి యిచ్చి వివాహం చెయ్యడానికి ఏమీ వెనుకాడలేదు. కాని కాలం వాళ్ళ ఆశలను, ఆశయాలను ఆనకట్ట వేసింది. కట్నానికి ఆశించి, చెప్పుడు మాటలకు దాసిన గిరిమనసు మారిపోయింది. అప్పటివరకూ కృతజ్ఞతతో నిండిన గిరిమనసు కృతఘ్నతా విషంతో కలుషితమైపోయింది! గిరిపైనే ఆశలుపెట్టుకున్నవారి ముగ్గురి ఆశల్ని అడియాశలు చేసి 'రమణి' అనే అందమైన, ఐశ్వర్యంగల అమ్మాయిని పెళ్ళిచేసుకొని, యింకో వూరికి

అతడి వుద్యోగాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. కొన్నాళ్ళు గడిచినతరువాత సీతదగ్గరనుండి ఒక వుత్తరం వచ్చింది గిరికి–అందులో–

'గిరీ!'

దిక్కులేని నిన్ను చేరదీసి, నిన్నొక మనిషిగా రూపొందించిన మాకు చివరికివచ్చిన ప్రతిఫలం–సంఘంలో వెకిలి నవ్వులూ, భరించలేని అవమానాలన్నూ, ఆ అజ్ఞాభారంతో, తనకూతురికి అన్యాయం జరిగిందనే రంపపుకోతతో, నీకు ప్రాణదానంచేసిన మానాన్నగారు తన ప్రాణాల్ని కోల్పోయారు. గిరీ! ఆ మహానుభావునివుసురు నిన్ను చిత్రవధ చెయ్యకతప్పదు. ఆయన ఆత్మ ఎంతక్షోభించిందో అంతకు రెండింతలు నీ ఆత్మక్షోభించక తప్పదు! అమాయకుల వుసురు అగ్నిలాదహించి వేస్తుంది! అప్పుడు ఈ అందమైన అమ్మాయిలూ, నీ కళ్ళకు మత్తెక్కించిన యీ డబ్బూ నీకు శాంతినియ్యవు. ఒకవేళ నీవంటివాళ్ళు అలా అనుకుంటే అది వాళ్ళ భ్రమ! నీకు న్యాయంచేసిన నంతమాత్రాన నాకు పెళ్ళి జరగదని భావించకు, చెట్టు కున్న పండు ఎవరకైనా లభిస్తుంది. కాని నీవంటివాళ్ళ కత్తిపోట్లు మాత్రం తగల కూడదు! నేనందుకే బాధపడుతున్నాను.

ఇక శెలవ్,

సీత!

ఉత్తరాన్ని ఆమూలాగ్రంగా చదివి 'ప్చ్' అని పెదవి విరచి టేబుల్ సొరుగులో పడేశాడు. ఆ తరువాత మళ్ళీ రెండు త్తరాలు సీతదగ్గర్నుంచి వచ్చాయి. వాటిని విప్పిచదవటానికి గిరికి మనస్కరించలేదు, కారణం తను చేసిన కృతఘ్నతను దూషిస్తూ మొదట వ్రాసినట్లుగానే వుంటాయని... కరంటు అంతరాయం వలన ఫేనుతో పాటు గిరిజ్ఞాపకాలు కూడా ఆగిపోయాయి! వాస్తవిక జగత్తులోనికి వచ్చాడు గిరి!

'ఛీ ఎంత పాడుపనిచేశాను. నిజంగా నేనీ నాడు అనుభవిస్తున్న నరకయాతనికి కారణం వాళ్ళ వుసురే. ముఖ్యంగా సీతకి తను చాలా ద్రోహం చేశాను! కన్నెపిల్లమదిలో వెన్నెలలాంటి ఆశలు నింపి ఒక్కసారిగా అమావాశ్యలాంటి చీకటిలోనికి విసిరివేశాను. ఆడదాని వుసురు, అందులోనూ కన్నెపిల్ల వుసురు వూరికేపోదు. తనకీ శాస్తి జరగవల్సిందే! ఆనాడు నా కళ్ళకు పొరలు క్రమాయ్మి! కానీ ఈనాడు నా క్రేలితో నా కళ్ళు పొడుచుకున్నట్లుంది. బాధపడుతూ గిరి–గబాగబా వెళ్ళి, డ్రాయరు సొరుగులో–సీత తరువాత వ్రాసిన రెండు వుత్తరాల్ని తిసి ఆత్రుతగా చదువసాగాడు, ఒక వుత్తరంలో–

'డియర్ గిరీ!'

నీవల్ల నాలో మొలకెత్తిన 'ప్రేమ' అనే మొక్కని త్రుంచి వేద్దామని ఎంతప్రయత్నించినా అది నాచేత కావటం లేదు, నిన్నెంత మరచిపోదామన్నా నీయొక్క రూపం ప్రతిక్షణం నిన్ను వెంటాడుతున్నట్టే వుంది! నిన్ను నా జీవితంలో మరచిపోతానేమోననిపిస్తోంది! గిరీ, యిప్పటికైనా మరచిపోయింది లేదు, నాలో మొలకెత్తించిన ఆ మొక్కని పుష్పించినట్లు చెయ్! అంతేగానీ, నీచేతులారా ఒక ప్రాణిని నాశనం చెయ్యొద్దు!నీ కోసం నా హృదయం ఎప్పుడూ తెరచుకొనే వుంటుంది...

ఇట్లు,

నీరాకకోసం వేయికన్నులతో ఎదురు చూసే,

సీత.

ఉత్తరం చదవటం పూర్తయ్యేసరికి గిరి ఆలోచనలు యింకోవిధంగా దారితీశాయి! అతడు వాళ్ళకేం ద్రోహం చేసినా, ఏ కల్మషంలేని సీత మంచి మనసుకు గిరి మనసులోనే జోహారుఅర్పించాడు. ఆమెదగ్గరకు వెళ్ళమని గిరి మనసు ఒక ప్రక్క వుసిగొలుపుతోంది! ఇటువంటి పరిస్థితిలో గిరికూడా అక్కడికి వెళ్ళడమే మంచి దనిపించింది! ఆ ఆనందాలతో గిరి మిగిలివున్న యింకో త్తరాన్ని విప్పి చదువసాగాడు.

గిరి!

రెండు వుత్తరాలువ్రాసినా జవాబు వ్రాయటానికూడా నీకు వురస్కరించక పోవటానికి మేం నీకు చేసిన అపకారమేమిటి నాకు అర్థం కావటం లేదు!కనీసం నక్కున్న విశ్వాసం కూడా మానవజన్మ ఎత్తిన నీకు లేక పోవటం చాలా శోచనీయం? అది నీ దురదృష్టం. ఎవరు చేసుకున్నది వారనుభవించాలి! మా అన్నయ్య వత్తిడి కోసం యీ వారంలోనే నేను పెళ్ళిచేసుకుంటున్నాను. పెళ్ళైనతరువాత నేను చచ్చినా బ్రతికినా ఒక్కటే! ఈ వుత్తరం నీ కెందుకు వ్రాయాలి! అని అనిపించింది, కాని ఏమూలో దాగివున్న 'ప్రేమ' అనే మనసుమాత్రం వుత్తరం వ్రాయమని నన్ను ప్రోత్సహించింది! ఇక నిన్ను శాశ్వతంగా మర్చిపోతాను–

ఇట్లు,

నీసొత్తు కాలేకపోయిన,

సీత!

ఉత్తరం చదవటం పూర్తయ్యేసరికి గిరికి ముచ్చెమటలు పోశాయి! మొదట చేసిన తప్పుకు యింకా దురదృష్టం నన్ను వెంటాడుతూనే వుంది, నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు అని విలపించ సాగాడు గిరి.